# ప్రతీకారమా....?

కథకుడు :
వినోదబాబు

★

రాత్రి పదిగంటలసమయం. మద్రాసుబీచిమీద ఓ యువకుడు కూర్చున్నాడు. ఆ తెల్లటిధోవతి, తెల్లటి చొక్కా ఆగాలికి మజాగా కెరటాలను సృష్టిస్తున్నాయి. ఆకాశాన్న అల్లల్లాడుతున్న ఆచిన్న చంద్రుడు అతికష్టంమీద లేత్రాయపు కాంతినిస్తున్నాడు. వస్తువులు లీలామాత్రంగానే అవుపిస్తున్నాయి. ఓయువతి తడబడుతున్న అడుగులతో, వేగంగా కొట్టుకునే గుండెలతో బీచికి త్వరగా వస్తున్నాది. విప్పారిన ఆమె నయనాలు అతిజాగ్రత్తగా నలుదిశలనూ పరికిస్తున్నాయి దేనికోసమో. ఆ యువకునికి ఓ మూడుగజాలదూరమువరకు ఆమె వచ్చి sudden గా ఆగిపోయింది. ఆమెకండ్లు ఒక్కసారిగా పెద్దవయేయి. ఆ చీకటిలో దూరంగా కూర్చునే ఆయువకుని ఆకారం స్పష్టంగా అవుపించటంలేదు. గాలిలోయెగిరే ఆ తెల్లని చొక్కానే ఆమె గుర్తుపట్టింది. ముందుకు మరి మూడడుగులు వేసింది. అతడు పాడుతున్న ఓ చిన్నపాట ఆమెకు వినవచ్చింది. 'అనుమానంలేదు — గోపాల్ ఏ' ఆమె పెదవులనుండి మెల్లగా వెలువడినై. ఆమె యెవనికోసము యింతదూరంవచ్చిందో అతడు అగుపించేడు.

రక్తం ఒక్కసారిగా ఆమెలో వుబికింది. తక్షణమే వొలలోనుండి బాకునుతీసింది. రివ్వున ముందుకుపరుగెత్తి ఒక్కసారిగా బాకును అతడి మెడలోనికి పోనిచ్చింది. బాధకరంగా ఓ పెద్దకేకను వేసి క్రిందకు ఒరిగిపోయేడు. దేహంచుట్టుకో పోయింది. ఆమె ఆ వేదనతో అతడిముఖంలోకి ఓసారి చూచింది. తక్షణమె భయంకరమైన ఓ చిరునవ్వు ఆమెముఖాన్ని ఆవరించింది. కోపదేవతకు కానుకగా నెత్తురు నివేదించింది.

ఆమె మరి అక్కడవుండలేదు. ఓసారి నలువైపులా తిలకించి ముందుకు పరుగెత్తింది. ఓ పదిగజాలదూరము పరుగెత్తిందోలేదో ఆమెచేతిని బలంగా ఓవ్యక్తి పట్టుకున్నాడు, 'ఆగు' అని గర్జిస్తూ. ఆమె అదరిపోయింది. ముందుకుమరి పోలేకపోయింది. తనలోనిశక్తిఅంతా ఒక్కసారిగా అణగిపోయింది. నిల్చుందికికూడా కష్టమనిపించింది. దేహం వణకుతున్నాది. భయంచే అల్లల్లాడుతున్న నయనాలతో అతడిముఖంలోకి చూచింది. అతికష్టంమీద పెదవులను తడిచేసుకుని-"దయచేసి నన్నువదలండి- నన్నుపోనివ్వండి," అనగలిగింది కాని కంఠంవణకుతూంది.

"ఆగు-నువ్వాయువకుని ఖూనీ చెయ్యలేదూ?"

"ఖూని!-ఆ."

"ఏమిటీ! పాపంరాదూ? నీచేతులెట్లా ఒచ్చేయి?"

"నేనెందుకు అతడ్ని చంపేనో మీకు తెలిసుంటే నన్నిలా నిందించరు—క్షమించి నన్ను పోనివ్వండి."

"ఉండు యెక్కడికిపోతావు. ఎందుకు చంపేవో ముందు చెప్పు."

"పోలీసులొస్తారు, నన్నువదలండి, నా పాపడిదగ్గరకు నన్నుపోనివ్వండి. మీకువెయ్యి నమస్కారాలిడుతాను."

"వీల్లేదు. నువ్వెందుకతడ్ని చంపేవో నేను తెలుసుకోవాలి."

"చెప్తా—గాని..." దూరాన్నుంచియెవరో వస్తున్నట్లు జాడ కనుపించింది. ఆమె మరీ వణకి

* "శ్రీవిస్ ఆమ్ల" తలనూనె పుష్పరసములతో తయారుచేసేంది. *

పోతూంది. అతడు ఆవిషయాన్ని గమనించేడు. రాబోయే ఆపదకూడా అతడికి వెంటనే స్ఫురించింది.

"నా వెంటరా, నీకేంభయంలేదు," అంటూ ఆమెరెక్కను బలంగాపట్టుకుని మరోవైపునకు త్వరగా నడవనారంభించేడు. ఆమె మౌనంగా అతణ్ని అనుసరించింది. పెద్దపెద్దవీధులను చాలదాటేరు. ఓరెండు సందులను తిరిగింతరువాత ఓచిన్నయిల్లును చేరుకున్నారు. ఓచేత్తో ఆమెరెక్కనిపట్టుకుని మరోచేత్తో తలుపును తెరచాడు. లోన ఓచిన్నలాంతరు గుడ్డిగా వెలుగుతూంది. నేలను పరుపబడిన ఓచాపను చూపిస్తూ—"అలా—కూర్చో" అంటూ తనువెళ్ళి తలుపు బంధించేడు. ఆలాంతరును ఆమెకుచేరువగా తెచ్చి కాంతినెక్కువచేసేడు. ఆమెపెదవులు శరీరంతోపాటు వణకుతున్నాయి. అతడు గమనించి ప్రక్కనున్న గదిలోనికిపోయి గ్లాసుతోనీళ్లు తెచ్చి, "పుచ్చుకో—సేదదీర్చుకొందువుగాని," అన్నాడు. ఆమె వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. గడగడా నీళ్ళన్నత్రాగేసి, కొంచెంమిగులుతే ముఖంపైజల్లుకుని, తనచీరచెరుగుతో ముఖాన్ని తుడుచుకుంది. అతడు ఆమెకు కొంచెముదూరంగా కూర్చున్నాడు. అనుభవంగల physiognomist కు మల్లేఅతడు ఆమెముఖాన్ని తీక్షణంగా పరీక్షించడం మొదలెట్టేడు. ఆమెలో యేమాత్రం క్రూరత్వం అతడికి గోచరించలేదు. అయిదునిముషాలు మౌనంగా గడచేయి. ఆమెకు లోన ఆందోళనగా నున్నప్పటికి పైకికొంచం కుదుటపడ్డట్టు అగుపిస్తూంది. అతడు నిశ్శబ్దాన్ని కోసేసేడు.

"అమ్మాయి! నువ్విక చెప్పొచ్చు—అతణ్ని యెందుకు చంపేవో. పోలీసులనుగురించి నువ్వేట్టి భయమును పొందనవసరంలేదు. కానీ—జంకక చెప్పు. ఒక ఆప్తమిత్రుడితో చెప్తున్నావనుకో," అనిఅతడు సౌమ్యభావంతో హెచ్చరించగానే ఆమె ఇట్లాతని జీవితరహస్యాన్ని సౌమ్యంగా చెప్పనారంభించింది;

"మాది తెనాలి. నాపేరు సుశీల. నాలుగేళ్ళక్రితం—అంటే నాకు 14.సంవత్సరాలవయస్సప్పుడు, నాకూ యిప్పుడు నాచే చంపబడిన యువకునికి పరిచయంకలిగింది. మాయింటి పొరుగునే యితడూ వుండేవాడు. మంచిరూపసి, పైగా బి. ఏ. చదువుతుండేవాడు. నిజంగా నేనతణ్నిగాఢంగా ప్రేమించేను. మా పవిత్రప్రేమకు నిరోధంగా నేదీరాలేదు. అందుచేత మాప్రేమ దినదిన ప్రవర్ధమానమైంది. ఒకర్నివిడచి ఒకరం వుండేగడియలు చాలకద్దు. అతడు ప్రేమగీతాలు వ్రాసేవాడు. వెన్నెలరాత్రుల్లో తోటలో చల్లటిగడ్డమీద చంద్రుణ్నిచూస్తూ పండుకునేవాళ్ళం. అతడు మధురంగా తనురాసినప్రేమగీతాలు శ్రావ్యమైన కంఠంతో పాడుతుంటే వింటూ తన్మయత్వాన్ని పొందుతుండేదాన్ని. ఆ మధురక్షణాలు యిప్పుడు తల్చుకోడం చాలకష్టం.


## చేతిపనుల
## వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంట్లు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టు ఖర్చులు 5 అణాలు.

### కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీ గ్రంథము చూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలోవుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,
12, అరుణాచలమొదలి వీధి, 18, బీటు, మద్రాసు.


* నేడే "శ్రీవిస్ అమ్ల" తలనూనె వాడుటకు ప్రారంభించండి. *

ఇద్దరం వివాహంచేసుకుందామనుకుని దేముణ్ణి సాక్షిగా పెట్టుకుని ప్రమాణంచేసుకున్నాంకూడ. ఈవుద్దేశంతోనే రహస్యంగా వెన్నెలరాత్రులలోని మాధుర్యాన్ని చాలసార్లుగ్రోలేం. నాతండ్రి నా వివాహాన్ని తలపెట్టేడు. నన్ను గోపాల్‌కిచ్చి వివాహంచేయించమని వెయ్యిదేముళ్ళకు మ్రొక్కేను. ఆఖరికి మనసుపట్టక మాఅమ్మతో ఓనాడు నావుద్దేశాన్ని వెల్లడించేనుకూడ. "అమ్మాయి! ఎంతమాట! వాళ్ళబ్బాయికే, వీల్లేదమ్మా వాళ్లుగొప్పవాళ్లూ, కట్నాలుకావాలి. ఇంతకీ వాళ్ళశాఖ తెలుసా? పొందదమ్మా మనశాఖలు వేరు," అంది. మానాన్నకీవిషయం తెలిసింది. "ఏమిటీ! శాఖాంతరవివాహాలే!! ఎవరు చెప్పేరు? అలాంటి వివాహాలుచేసి మనకుటుంబానికి కళంకంరానిస్తానా? మనపూర్వాచార పరాయణత్వానికి చెదపురుగునౌతానా? ఇంతకీ మనఅమ్మాయి సుశీలకేనా యీ దుర్బుద్ధిపుట్టింది—", అని గర్జించేసరికి నేనుహడలిపోయేను. ఇంకోటి—గోపాల్ తండ్రి, తనకుమారునికి 5000 రూపాయలు ముందు కట్నం క్రిందపోస్తేగాని వివాహంచెయ్యనన్న పట్టుదలకలిగివుండేవాడు. అందుచేతేచాలసంబంధాలు తిరిగిపోయేయి. మానాన్న యింతకట్నం యిచ్చుకోలేడు. ఈ రెండుకారణాలవల్ల నేను గోపాల్‌ని వివాహమాడలేనని నిశ్చయమైపోయింది.

నేనూ గోపాల్ ఓనాడు ఒకనిర్ణయానికి వచ్చేం. మాతల్లిదండ్రులు మాయిరువురికి వివాహం చెయ్యరని విశదమైపోయింది. నాకు యేంచెయ్యడానికి పాలుపోయిందికాదు. నాకానాడల్లా గోపాల్ బోధించేడు. మాప్రేమను ఒక్కసారి తల్చు

(తరువాయి 28 వ పేజీ)

బ్రహ్మాండమైన
ప్రారంభము.
★
సాటిలేని కోటి ప్రేమగాథ
అని సంస్తుతించబడింది.

THE NEW THEATRES LIMITED
CALCUTTA

స్టార్ టాకీస్‌లో
11-6-43 నుంచి
★
న్యూ థియేటర్స్‌వారి
సంగీత నృత్యనాటిక

మీనాక్షి

తారాగణం :—
మహోజ్వల తార
సాధనాబోస్
★
నజముల్ హుసేన్
అహీన్ చౌదరి
కే. సి. డే
★
సంధ్యారాణి
పన్నా
దేవబాల

సాధనాబోస్‌ను చూడండి. ఇండియాదేశపు ప్రఖ్యాత నర్తకి వెండితెరమీద
స్పిట్ ఫైర్ విమానంలాగు మెరుస్తుంది!
ఒక ఆధునిక రమణి అర్ధరాత్రపు సాహసంతో మీమనస్సుల్ని ఉద్రూతలూగిస్తుంది!
కలకత్తా ఫిలిం ఎక్స్చేంజి రిలీజు

(21 వ పేజీ తరువాయి)

కుని అతడితో నేను పరారవడానికి సిద్ధమవమన్నాడు. అతడిమాటలు విశ్వసించేను. నా ప్రేమకోసం అన్నిటినీ త్యాగంచేసుకుని తల్లిదండ్రులకు ఆఖరి నమస్కారమిడి గోపాల్ ని అనుసరించి యీ మద్రాసు వచ్చేసేను.

ఓ యేడాది ఆనందమయంగా గడచిపోయింది. అతడు యింటినుండి తెచ్చిన డబ్బంతా వ్యయమైపోయింది. ఈ లోపుగా అతడికి కొంచం త్రాగుడు కూడ అలవాటైనట్టు అనుమానించేను. దీనికి కారణం చెడుసహవాసమే. చేతుల్లో దమ్మిడీలేకపోయింది. రెండోయేడాదిలో తాపీగా నా నగలన్నీ బజారుకు వెళ్ళేయి. నేనభ్యంతరపెట్టలేదు. నాకో పుత్రుడుకూడ జన్మించేడు.

అతడికి త్రాగుడుకూడ యెక్కువైంది. త్రాగేసివచ్చినను యెద్దునిబాదినట్లు అకారణంగా బాదేవాడు. రానురాను నన్ను ప్రేమించటం మానేసేడు. ''తల్లిదండ్రులకు చెప్పకుండా 'ప్రేమ' అన్న వెధవపేరు పెట్టుకుని పరాయివాడినైన నాతో లేచివచ్చినదానవు నువ్వు సంసారివని ఎలానమ్మను. నేనింట్లోలేనప్పు డేంచేస్తున్నావో యెవరికెరుక. కులటా!''అని నన్ను బాదేవాడు త్రాగేసి. నాపాపడు గొల్లుమనేవాడు. మరోయేడాది గడిచింది.

నాదగ్గరున్న బంగారమంతా ఐపోయింది. దాంతోపాటే నాయందు అతడికి ప్రేమకూడ పూర్తిగా నశించింది. చేతిలో చిల్లిగవ్వైనలేదు. ఈలోపుగా గోపాల్ కి యీ వూరులోని ఓ ధనికురాలకు పరిచయం కలిగింది. గోపాల్ చక్కదనాన్ని చూచి ఆమె మురిసిపోయి, అతడ్ని ప్రేమించి తనింటికి తీసుకునిపోయింది. అప్పటినుండి గోపాల్ దానింట్లోనే యుండిపోయేడు. నన్ను పూర్తిగా మరచిపోయేడు. నేను, గత్యంతరంలేక, వీధిముష్టెత్తుకోడం ప్రారంభించా, నాపాపడితో. బాబూ! ఆఖరికి చూచారా నాగతియెట్లావచ్చిందో. ఎంత యింట్లో పుట్టి యెలా పెరిగేను, ఆఖరికి నా ప్రేమవల్ల ఎలాంటి పర్యవసానము తేలిందో గమనించారా? ఇంకా వినండి నే నెలాంటి హీనదశకువచ్చేనో తెలుస్తుంది మీకే.

ఓనాడు నేను బజారులో ముష్టెత్తుకుంటుంటే గోపాల్ కలసేడు. పాపడ్ని గోపాల్ పాదాలమీద వేసి, నా కన్నీళ్ళతో అతడిపాదాలను అభిషేకం చేసేను. మనిషి రవంతైనమారలేదు. నావైపన్నా కనీసం చూడలేదు. పరాయివాడుకూడ అలా ప్రవర్తించడు. గోపాల్! నన్నీవూరుకు తెచ్చేవునీవే నన్నిలా ద్రోహంచేస్తావా. నేనాఖరికి నీనించి ముష్టెత్తుకుంటున్నాకూడా– తెలుసా? నాకుమార్గమేది. నాపై నీకుండిన మునుపటిప్రేమంతా ఎక్కడికి


## మదనకామేశ్వర లేహ్యము




బలవర్ధకమయినది. మేహమునికొంక నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తినికలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 1-8-0

## రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు మూలవ్యాధి మొదలగు వాటిని హరించి కొలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 0-12-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాట్లాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం- పెరిదేపి, నెల్లూరుజిల్లా.


* “శ్రీవిస్ ఆమ్ల” తలనూనె సువాసనకలదు. *

పోయింది అప్పటి ప్రేమభాషణాల్ని అంతలోనే మరచేవా. కనీసం నాపైనీకు కనికారమేనా లేదా,'' అని ప్రతిమాలుకున్నా.

''ఎవరునువ్వు? యీ కరూపినా నేనుప్రేమించేను! యెంతఅన్యాయం; ఓముష్టిముండ నాభార్యా!! ఛో, ఛో, నువ్వు దొంగలాగున్నావు; లేకపోతే నీకు పిచ్చెత్తిందా. నేనెవర్ని నువ్వెవరు,'' అని ముఖాన్ని అవలికి త్రిప్పుకుని గబగబా తనత్రోవను తను పోయేడు.

బాబూ! హృదయం యెంతగా క్షోభిస్తుందో ఒక్కపరి ఆలోచించండి. అప్పటికీ వెంటనే నేనీ నిర్ణయానికి రాలేకపోయేను.

మరో ఆర్నెల్లు ముష్టెత్తుకునే జీవితాన్ని గడపేను. నా కప్పుడప్పుడూ గోపాల్ కనుపిస్తూనే వుండేవాడు. నన్ను చూచినప్పుడల్లా వెంటనే తప్పుకునేవాడు మరి అగుపించకుండా. ఈలోగా నన్ను చూచి, ''ఇంతఅందకత్తెవు, అలా ముష్టెత్తుకోక పోతే నాతోలోనికివస్తే ఓరూపాయి పారెయ్యనూ! రా,'' అని కామాంధులు చాలామంది నీచంగా అనేవారు. ఆఖరికి వీళ్ళను తప్పించుకుని యీ ముష్టి జీవితాన్ని గడపడంకూడ దుర్భరమనిపించింది. చేతిలో యేమీ లేదు. పోనీ తల్లిదండ్రులవద్దకు తిరిగివెళ్ళిపోదామంటే, యీ కాస్థితిలో యెలాఆదరిస్తారు. అందులో మా నాన్న!! 'జాతిచెడినముండవు, గుమ్మాలెక్కడానికేనా వీల్లేదు', అంటాడు. కన్న తల్లిదండ్రులే ఆదరించనప్పుడు తోడబుట్టిన సోదరులైనా యెలా పలకరిస్తారు. నాకీప్రపంచంలో 'నా' అనతగినవారెవరూ లేరు. నాపాపమే గాని లేకపోయివుంటే, నేనీపాటికీలోకంలోనే వుండకపోయుందును.





**37 సంవత్సరాలక్రితం...**

యునైటెడ్ ఇండియా వారు మొదట్లో పాలసీని వ్రాసినప్పుడు మన దేశములో ప్రజలను జీవితభీమా ద్వారా రక్షించవలెనను వుద్దేశ్యము బాల్యావస్థలోనే యున్నది. అది కేవలము ఒక నూతనభావము.

నేడు...యునైటెడ్ ఇండియా
మీరు విశ్వసింపదగిన పేరు

యునైటెడ్ ఇండియావారి యీ విజయము బహు సులభమైనది. అది 37 సంవత్సరాలతో నెమ్మదిగాను, జాగ్రత్తగాను, ముందు వెనుక లాలోచించుచూ రు 70,000 అమలులోనున్న మొత్తము రు. 16,000,000 ల ఆస్తులు రు. 4.000,000 ల వార్షికాదాయములను పోగుచేయుచు చేసిన అభివృద్ధి యీ విజయసాధనలు. సంస్థయొక్క పటుత్వము, ప్రాధాన్యములను తెలియపర్చును.

## యునైటెడ్ ఇండియా

లైఫ్ అష్యూరెన్సు కంపెనీ లిమిటెడ్,
యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్,
ఎస్ప్లనేడ్ : : మద్రాస్.

ఇండియాలో అంతటా బ్రాంచీలు,
యేజన్సీలు కలవు.

బ్రాంచి ఆఫీసు : రామేశంవీధి, కాకినాడ.
పోస్టుబాక్సు నెం. 281.

టెలిఫోన్ : 4475/6 Grams : UNITED.


* ''శ్రీవిస్ అమ్మ'' తలనూనె ఒకసారి వాడినచో మరి మీరు విడువరు. *

నాపొట్ట అంటుకోపోయింది. ఈనాడు దమ్మిడైనా దొరకలేదు. నాపాపడిగోల భరించలేక పోయేను. నిజానికివస్తే నాలోని యీ వేడిరక్తమే, నాజీవితాన్ని అధఃపాతాళానికి అణగద్రొక్కిన ఆ కర్కశ హృదయుడిపై, ప్రతీకత్షుబూని నన్నీ కార్యానికి ప్రేరేపించింది. నాపని నేను చేసేసేను. నా మనస్సిప్పుడు కొంచెం శాంతినిపొందింది. నాపాపడు జీవించినన్నాళ్ళు యెలాగోకష్టపడి జీవిస్తాను, తరువాతి నామరణం నాచేల్లోనేవుంది. ఇంత నేనుచేసిన పని అన్యాయమంటారా? నాప్రేమకు యేర్పడిన పర్యవసానమును తెలుసుకున్నారా. ఎవరిది పాపమంటారు?'' అతడికి, యేమని జవాబివ్వాలో తెలిసిందికాదు. ఆమె చరిత్రను విన్నతరువాత ఆమెపై అతడికి అప్రయత్నంగా అపరిమితమైన జాలికలిగింది. ఆమెకంటివెంట నీరు అలానే కారుతుంది.

ఆమెజీవితగాథ తరువాత ఆమెచేసిన అపరాధానికి శిక్షించే పోలీసు అధికారులకు వొప్పగించాలా? లేదు ఆ అభాగ్యస్త్రీని రక్షించాలా?... యోచించాను. ఆఖరికి ఆమెను ఆమె చంటిబిడ్డను అనాదాశ్రమానికి చేర్పించేను.

కొన్నినెలలు తరువాత ఒక్కసారి ఆమెను చూడ్డానికివెళ్లేను ఆమె అక్కడలేదు. విచారించేసరికి ఆమెయిప్పుడు నర్సుపని నేర్చుకొని జనరల్ ఆసుపత్రిలో నర్సుగావుందని అన్నారు. ఆసుపత్రిలో వెళ్ళిచూచాను. నేనుచేసిన వుపకారానికి ప్రత్యుపకారంగా ఆనందభాష్పాన్ని కురిపించింది.

ఒకప్పుడు జైల్లో అష్టకష్టాలుపడబోతున్న జీవి నేటికి కొన్నివేలమందికి ఆధారమై నిష్కల్మషమైన సేవచేస్తూవుంది.





● ● ●

భారతదేశ పరిశ్రమలలో ఈ మద్రాస్ ఎనామెల్ వర్క్సు పరిశ్రమ పెద్దపరిశ్రమ. ఇక్కడ పలువిధములయిన పింగాణిగిన్నెలు, పళ్లెములు, పాత్రలు, సైన్ బోర్డులు, గృహోపకరణములు, విద్యుద్దీపాచ్ఛాదనములు, ఇంకను పలువిధములయిన పింగాణి వస్తువులు అందముగా తయారుచేయు ఉన్నత ఆంధ్రపరిశ్రమ.

● ● ●

ఇంత పెద్ద పింగాణి పరిశ్రమ దక్షిణ దేశమందు మరియెక్కడను లేదు.

మద్రాస్ ఎనామెల్ వర్క్సు లిమిటెడ్,
65, సిడెన్‌హామ్సు రోడ్డు, మద్రాసు.